మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని శివానగర్ గ్రామంలో మల్లిఖార్జున స్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్ఎస్ నేత గూడెం మధుసూదన్‌రెడ్డి స్వామివారి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, గంగురమేశ్‌లతో పాటు స్థానిక నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు తనిఖీ



పెట్రోల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలోని పెట్రోల్ బంకులో పెట్రోల్‌తో పాటు నీరు రావటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు డీఎస్ఓ వనజాత సిబ్బందితో వచ్చి పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు ఇస్తామని అధికారులు చెప్పారు.

ఏళ్లు గడుస్తున్నా.. సాగని పనులు

చెరువుల అభివృద్ధి అంతంతే..

- గుర్రపుడెక్క, మురుగునీటితో నిండిన చెరువులు
- చెరువులను సర్వే చేయించి సుందరీకరణ పనులు చేపట్టాలి
- స్థానిక ప్రజల డిమాండ్



గుర్రపుడెక్క, మురుగునీటితో నిండిన పటేల్‌చెరువు

మియాపూర్: చెరువుల సుందరీకరణ పనులు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టగా కొంతమేర జరిగి నిలిచిపోవడంతో కాలుష్య కాసారాలుగా మారాయి. చెరువుల సుందరీకరణతో బాటు మంచినీటి చెరువులుగా మారుస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబుతున్నా ఆ దిశగా పనులు జరగడం లేదు. గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, మురుగునీటితో నిండిపోయాయి. చెరువులు, కుంటలకు పూర్వ వైభవం తీసుకువస్తామని పలు కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఆ ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. చెరువులు మురుగుమయంగా మారడంతో దోమలకు ఆవాసాలుగా తయారయ్యాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలను సుందరీకరించి అభివృద్ధి చేసేందుకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.



మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు



మియాపూర్ నాయినమ్మకుంటలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

- మియాపూర్ డివిజన్ పరిధిలో నాయినమ్మ కుంట, రామసముద్రంకుంట, రేగులకుంట, పటేల్ చెరువు, మక్త చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు.
- పటేల్ చెరువు రూ.12 కోట్లతో, రేగులకుంట చెరువు రూ.1.20 కోట్లు, నాయినమ్మ కుంట చెరువు రూ.1.25 కోట్లతో, మీదికుంట చెరువు, మక్త చెరువులకు రూ.2.13కోట్లు, రామసముద్రం చెరువుకు కోటి రూపాయలు కేటాయించారు.
- పటేల్ చెరువుకు నిధులు కేటాయించి ఐదేళ్లు గడుస్తున్నాయి. ఐదేళ్ల క్రితం చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు చెరువు చుట్టు కట్ట ఏర్పాటు చేశారు. మురుగు మళ్లించేందుకు కొంతమేర పైపులు వేసి వదిలేశారు.
- మిగతా చెరువులకు చుట్టు మట్టి పోసి వదిలేశారు.చెరువులు, కుంటల అభివృద్ధి పేరుతో చెరువులు ఖాళీ చేశారు. దీంతో చెరువులలో చుక్క నీరు లేదు.
- మియాపూర్ డివిజన్ పరిధిలోని చెరువులన్నీ పూర్తిగా మురుగునీటితో నిండి గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి.
- చెరువుల చుట్టు పక్కల ప్రాంతవాసులు దుర్గంధం, దోమల బెడదతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇక మియాపూర్‌లోని చెరువులు చాలా వరకు కబ్జాలకు గురయ్యాయి. మళ్లీ సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నల్గొండ సభను విజయవంతం చేయండి

గచ్చిబౌలి: చలో నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, ఏరియా కమిటీ మెంబర్లు అందరూ తరలిరావాలని కోరారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించిన నేపథ్యంలో హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని తెలిపారు. భారీ సంఖ్యలో తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి ..6 వినతి పత్రాలు



డీసీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపకమిషనర్ వంశీ కృష్ణ నిర్వహించారు.6 వినతి పత్రాలు రాగా రెండు టౌన్‌ప్లానింగ్, రెండు ఇంజనీరింగ్ విభాగంకు, మరో రెండు యూసీడీలకు వసతులపై ఫిర్యాదులు చేశారన్నారు.

శేరిలింగంపల్లిలో 2 ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్, స్ట్రీట్ లైట్లకు దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. సర్కిల్ ఏసీపీ మెహ్రా, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ యూసుఫ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వినతి

హఫీజ్‌పేట్: జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ ,బీజేపీ నాయకుడు శంకర్ యాదవ్‌కు హఫీజ్‌పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్‌యాదవ్, నాయకులు సోమవారం ఆయనను కలిసి ఆస్తి పన్నుపై వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు నుంచి క రోనా కారణంగా మధ్య తరగతి ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జీహెచ్ఎంసీ పరిధిలో ని అన్ని సర్కిళ్లలో ఆస్తి పన్నుపై వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలని కోరామన్నారు.

ఫంక్షన్ హాలు ప్రారంభం



ఫంక్షన్‌హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి, వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ రిక్రియేషన్ సెంటర్ ఆవరణలో వడ్డేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంగీత్ నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన సొంత నిధులతో నిర్మించిన ఫంక్షన్ హాలును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వడ్డేపల్లి నర్సింగరావు జ్ఞాపకార్థం ఫంక్షన్ హాలును కాలనీ సభ్యులు ఉపయోగించుకునే విధంగా నిర్మించడానికి ముందుకు వచ్చిన రాజేశ్వరరావును అభినందిస్తున్నానన్నారు. సమాజ హితంతో ముందుకు రావటం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన



మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో మల్టీ జనరేషన్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ అధికారులు, యూబీడీ అధికారులతో కలిసి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గప్రసాద్, యూబీడీ మేనేజర్ సమీరా, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, కుర్మయ్య, అన్వర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రాయదుర్గం: విద్యార్థుల ప్రదర్శనలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం గచ్చిబౌలి టీఎన్‌జీఓ కాలనీలో గోల్డ్ క్రెస్ స్కూల్‌లో 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా థీమ్' పేరిట వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలను పాఠశాల వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ బూసాని, సునైనా ప్రకాశ్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు భారతదేశంలోని వివిధ సంస్కృతులు, రాష్ట్రాల ప్రాముఖ్యతను వివరించే నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో సునైనా ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకుసాగాలని సూచించారు. దేశంలోని వివిధ రకాల సంస్కృతులపై విద్యార్థులలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అడ్మిన్ అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శ్రమదానం



జర్నలిస్ట్ కాలనీలో చెత్తను తొలగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రాయదుర్గం: ఐటీ ఉద్యోగులు పలుగుపార చేతబట్టారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని స్కైవ్యూ టవర్స్‌లోని డీబీఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగులు 150 మంది గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలో సోమవారం శ్రమదానం చేశారు. యునైటెడ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక పార్కులో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వారిని జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



గౌతమినగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, స్థానికులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీ సమస్యలను కాలనీవాసులు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. గౌతమినగర్‌లో 80 అడుగుల లోతు సెల్లార్ తీయడం వల్ల రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కుంగిపోవటంతో దినదినగండంగా బతుకున్నామని, పక్కన వున్న నివాస సముదాయాలు కుంగిపోతాయేమోనని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దాన్ని పరిశీలించిన ఆయన కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు కనీసం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని, ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని కోరారు. అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని జీహెచ్‌యంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, ఇతర అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యంగౌడ్, కొడాలి రవి, కావూరి ప్రసాద్, శ్రీకాంత్, సాద మహేష్, రాజిరెడ్డి, మురళి, మోహన్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిథమ్ విద్యార్థినులకు ప్రతిష్టాత్మక ఫెలోషిప్



మంత్రి జూపల్లి కృష్ణారావుతో విద్యార్థినులు

రాయదుర్గం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) విద్యార్థినులు అంతర్జాతీయ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. నిథమ్‌లో బీబీఏ చదువుతున్న సాయిరష్మిత, సుష్మలు యూరోపియన్ యూనియన్ ఎరాస్మస్ ప్లస్ ఫెలోషిప్ లభించింది. లాట్వియాలోని విజ్‌డమ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లో టూరిజమ్, హాస్పిటాలిటీ కోర్సును అభ్యసించడానికి ఈ ఫెలోషిప్‌ను పొందారు.

అభినందించిన మంత్రి కృష్ణారావు

నిథమ్ విద్యార్థినులను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్‌లు సోమవారం అభినందించారు. నిథమ్ ఇన్‌చార్జీ డైరెక్టర్ కె నిఖిల, నిథమ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్ డాక్టర్ మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి, కార్యదర్శిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నిథమ్‌కు మరింత పేరు వచ్చేలా చేయాలని సూచించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



ఎస్ఎస్‌యూఐ విద్యార్థులతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

రాయదుర్గం: యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు రాజకీయాల గురించి, ఎన్ఎస్‌యూఐ పోరాట చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. రాజకీయాల్లో విద్యార్థుల పాత్ర తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు.

హెచ్‌సీయూ–ఎన్ఎస్‌యూఐ నూతన కార్యవర్గం

హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విభాగం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ ప్రకటించారు.హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ నూతన అధ్యక్షుడుగా నేహ జయరాజ్, ఉపాధ్యక్షులుగా పి.మార్క్, దారం మహేష్, ప్రధాన కార్యదర్శులుగా ప్రభాకర్‌సింగ్, మహ్మద్ నద్రాన్ ఎంపిక అయ్యారు. వీరిని ఎమ్మెల్సీ వెంకట్, రాష్ట్ర కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ అభినందించారు.

గోల్ఫ్ లీగ్ సెమీస్‌లో సామా ఏంజెల్స్, టీమ్ ఆల్ఫా



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో సామా ఏంజెల్స్ టీమ్ ఆధిపత్యం కొనసాగుతోంది. టైటిల్ రేసులో దూసుకెళుతున్న సామా ఏంజెల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థికి ఒక్కపాయింట్ కూడా ఇవ్వకుండా సెమీస్‌లో అడుగుపెట్టింది. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 80–0 స్కోర్‌తో ట్యూటోరూట్‌పై విజయం సాధించింది. మరో క్వార్టర్ ఫైనల్లో డీఎస్ఆర్ వరల్డ్ టీమ్ 45–35 స్కోర్‌తో క్షేమా టీమ్‌పై గెలిచింది. ఇక విలాజియో హైలాండర్స్ 50–30 స్కోర్‌తో మీనాక్షి మావెరిక్స్‌పై విజయం సాధించగా...టీమ్ ఆల్ఫా 45–35 స్కోర్‌తో రఫ్ రైడర్స్‌ను ఓడించింది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వేదికగా జరగనున్న తొలి సెమీఫైనల్లో డీఎస్ఆర్ ది వరల్డ్ , సామా ఏజెంల్స్ , రెండో సెమీస్‌లో టీమ్ ఆల్ఫా, విలాజియో హైలాండర్స్ తలపడనున్నాయి. ఈ టోర్నీ ఫైనల్ థాయ్‌లాండ్‌లో జరగనుంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



రాజీవ్ గృహకల్పలో అవగాహన కల్పిస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధ్యేయమని బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సెంటర్‌లో భారత్ వికసిత సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ రాము, డివిజన్ అధ్యక్షులు రాజుశెట్టి, రమేష్, నరిసింహ, శ్రీను, అజయ్, విజయలక్ష్మి, శ్యామ్, అఖిల్, ఆంజనేయులు, మీన, జ్యోతి సుజాత, సుస్మిత, రాజేష్, స్వాతి, కౌసల్య, సుభాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ డీఎస్‌యూ నూతన కార్యవర్గం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని దళిత విద్యార్థి. సంఘం (డీఎస్‌యూ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు .కన్వీనర్ కూచిపూడి రాజా, కో కన్వీనర్ తుంగరమేష్ ఆధ్వర్యంలో ఏకంగా 32 మందితో కూడిన జంబో కార్యవర్గం ఏర్పాటైంది. నూతన అధ్యక్షుడుగా సిలపాక వెంకటాద్రి, కార్యదర్శులుగా ఈర్ల కమలాకర్, ఉమేష్ అంబేద్కర్, నూతన ఉపాధ్యక్షుడుగా వర్దన్‌తేజ, కోకన్వీనర్ శేఖర్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)20, క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20.

4 లక్షల విలువ చేసే 760 గ్రాముల హష్ ఆయిల్ సీజ్

ఇద్దరి అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు





హష్ ఆయిల్ తరలిస్తుండగా చందానగర్ పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

హఫీజ్‌పేట్: రూ.4 లక్షలు విలువ చేసే 760 గ్రాముల హష్ ఆయిల్‌ను సీజ్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంకు చెందిన నర్మద్ ప్రవీణ్ కుమార్ (32), నగరంలోని బోరబండలో నివాసముంటూ కలుపు నూనె సరఫరా చేస్తుంటాడు. విశాఖపట్నంకు చెందిన వద్దదాడి సాయికుమార్ (28) విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో బిర్యానీలు అమ్ముతూ జీవిస్తున్నాడు. రాజారావు అనే వ్యక్తి వీరికి హష్ ఆయిల్ సరఫరా చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి లింగంపల్లికి రైలులో 760 గ్రాముల హష్ ఆయిల్‌ను తీసుకువచ్చారు. లింగంపల్లి నుంచి బోరబండకు ఆటోలో బయలుదేరారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రా వాహనాలు తనిఖీలు చేస్తున్న చందానగర్ పోలీసులను గమనించిన ప్రవీణ్‌కుమార్, సాయికుమార్‌లు ఆటో దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న రెండు సంచులను తనిఖీ చేయగా 760 గ్రాముల ఆయిల్ కనబడింది. వెంటనే వారిద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 2 సెల్‌ఫోన్లు, 760గ్రాముల హష్ ఆయిల్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

డాక్టర్ అదృశ్యం



అదృశ్యమైన డాక్టర్ శిరీషా రెడ్డి

గచ్చిబౌలి: హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన డాక్టర్ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయిలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన డాక్టర్ కె.శిరీషారెడ్డి(25) ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా చేస్తోంది. ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో స్నేహితుడు సాయికి ఫోన్ చేసి నేను వెళ్లిపోతున్నాను అని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. అప్పటి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శిరీషకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లుగా తెలిసిందని పోలీసులు తెలిపారు.

ఇటుక బట్టీలతో ఇక్కట్లు

- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- రోడ్డు పక్కన ఉన్న బట్టీలతో దుమ్ము, దట్టమైన పొగలతో తరచూ ప్రమాదాలు
- అధికారులు పట్టించుకోవాలని స్థానికుల వినతి



జిన్నారం-అన్నారం గ్రామాల నడుమ ప్రధాన రహదారి పక్కన వెలసిన ఇటుక బట్టీలు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుక బట్టీలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా బట్టీలు ఉండటంతో వాటి నుంచి వచ్చే దుమ్ముకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఇటుకలు కాల్చిన సమయంలో దట్టమైన పొగలు వస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.మండల కేంద్రమైన జిన్నారం నుంచి జంగంపేట మీదుగా గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా 50వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి. లక్షల సంఖ్యలో ఇటుకలను తయారు చేస్తుంటారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. బట్టీల నుంచి దట్టమైన పొగలు వస్తుండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశంలో ప్రతిసారి సభ్యులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. కానీ సమస్యను పరిష్కారానికి అధికారులు ఏ చర్యలు తీసుకోవటం లేదు. ఇటుకబట్టీల నిర్వాహకులు గ్రామ పంచాయతీలకు ఎలాంటి పన్ను కట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దూర ప్రాంతాల్లో బట్టీలను నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తున్నాం: గంగాభవాని, తహశీల్దార్, గుమ్మడిదల

అనుమతులు తీసుకుని ఇటుక బట్టీలను ఏర్పాటు చేయాలి, అసైన్డ్ స్థలంలో ఏర్పాటు చేసిన బట్టీలను ఖాళీ చేయాలని గతంలో నిర్వాహకులను ఆదేశించాం. బట్టీలను ఖాళీ చేయని వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బట్టీలు నిర్వహించుకోవాలి.

బైక్ అదుపు తప్పి.. ట్రక్కును ఢీ కొట్టి

యువకుడు మృతి.. మరొకరికి గాయాలు



మృతి చెందిన ఫకీర్ సాబేర్(ఫైల్)

గచ్చిబౌలి: బైక్ అదుపు తప్పి ట్రక్‌ను ఢీ కొట్టిన యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలో నివాసం ఉండె ఫకీర్ సాబేర్(22), అతని స్నేహితుడు సాయి కలిసి డిస్కవరీ బైక్‌పై గౌలిదొడ్డి నుంచి నానక్‌రాంగూడ వైపు వెళుతున్నారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో క్యూ సిటీ వద్ద రోడ్డుపై ఉన్న జీహెచ్ఎంసీ శానిటేషన్ వాహనాన్ని వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఫకీర్ సాబేర్ మృతి చెందినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారు. సాయి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ గేటు వద్ద వాహనం ఢీ కొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున 4 గంటలకు మృతి చెందాడు. మృతుడి బస్ పాస్‌పై వంశీ కృష్ణ అని ఉందని, అడ్రస్ తెలియదని పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 9490617127 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

మరో ఘటనలో.. యాచకుడు

హఫీజ్‌పేట్: ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సరితారెడ్డి తెలిపిన ప్రకారం ఆదివారం రాత్రి చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని జీహెచ్ఎంసీ ఫ్రూట్ స్టాల్ వద్ద వ్యక్తి (35) పడిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై తెల్ల బనియన్, గ్రే కలర్ ప్యాంటు వేసుకొని ఉన్నాడని తెలిపారు.